



రూ.5 లక్షల విరాళం
ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి మండపల్లి వెంకటేశ్వరరావు దంపతులు (రాజానగరం) రూ.5,05,116 విరాళం అందజేశారు.



అభివృద్ధి పథంలో అంతర్వేది
అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి పుణ్య క్షేత్రంలో భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది.

8లో

డెల్టాలకు 8,300 క్యూసెక్కులు


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులకు చేరింది.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు
- ఘనంగా ఇన్‌స్పైర్ విజ్ఞాన ప్రదర్శన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆధునిక విజ్ఞాన శాస్త్రాన్ని అందిపుచ్చుకుని, సృజనాత్మకను జోడించి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌లు పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన గురువారం స్థానిక సీజీటీఎం ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగింది. దీనిని ఎంపీ మార్గాని, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, జేసీ తేజ్‌భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, శాస్త్ర, విజ్ఞాన రంగంలో భారత్ ఎన్నో విజయాలు సాధిస్తూ ప్రపంచ దేశాలకు గట్టి పోటీ ఇస్తోందని అన్నారు. నేడు పాఠశాల స్థాయిలో చేసిన ఆవిష్కరణలు భవిష్యత్తులో ఎందరికో స్ఫూర్తినిచ్చేలా ఉండాలని సూచించారు. చదువు మాత్రమే మనకున్న ఆస్తి అని, దానిని ఎవ్వరూ దొంగిలించలేరని చెప్పారు. ప్రపంచాన్ని శాసించే స్థాయికి భారత్ ఎదగాలంటే ప్రతి విద్యార్థీ నంబర్ వన్ స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ, నూరు శాతం పట్టుదలతో కృషి చేస్తే లక్ష్య సాధన సులభమవుతుందని చెప్పారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ స్టేట్ హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ఇబాదుల్లా, స్టేట్ మైనారిటీస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ షేక్ నిజాముద్దీన్, ఇన్‌స్పైర్ మనక్ జాతీయ స్థాయి పరిశీలకుడు శుభదీప్ బెనర్జీ, జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈఓ ఎ.దుర్గా తులసీదాస్, సీజీటీఎం పాఠశాల అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయిని లిడియా గ్రేస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి 9 ప్రాజెక్టులు

నేటి బాలలు రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగాలని రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. సాయంత్రం జరిగిన ఇన్‌స్పైర్ ప్రదర్శనల ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు, మెమెంటో, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఇన్‌స్పైర్‌లో అధిక శాతం ప్రాజెక్టులు మన జిల్లా నుంచే రిజిస్టర్ కావడం గర్వకారణమని అన్నారు. జాతీయ స్థాయి పరిశీలకుడు శుభదీప్ బెనర్జీ మాట్లాడుతూ, ఈ ప్రదర్శనకు వినూత్నమైన ప్రాజెక్టులు వచ్చాయని ప్రశంసించారు. రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి, అక్కడి నుంచి జపాన్ వరకూ కూడా ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు వెళ్లే అవకాశం ఉందని, ఆ విద్యార్థులకు స్కాలర్‌షిప్ కూడా లభిస్తుందని తెలిపారు.

ఎంపికైన ప్రాజెక్టులివీ..

1. మల్టీపర్పస్ అగ్రికల్చరల్ టూల్స్, ఆనందారి విహారిక, జెడ్పీ హైస్కూల్, కాపవరం, బిక్కవోలు మండలం. 2. దుంప నుంచి బయో ప్లాస్టిక్ తయారీ, కోటంశెట్టి పాలిన, జెడ్పీ హైస్కూల్, మల్లవరం, గోకవరం మండలం. 3. రైతుబంధు అగ్రికల్చరల్ మెషీన్, బైశెట్టి లక్ష్మణ్, జెడ్పీ హైస్కూల్, ఐ.పంగిడి, కొవ్వూరు మండలం. 4. అరటి పండు తొక్క నుంచి నార తీసి, పేపర్ తయారు చేయడం, చల్లా రామ్‌చరణ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెరవలి. 5. సీడ్ డ్రిల్, మిద్దే కౌశిక్, అక్షర హైస్కూల్, రాజమహేంద్రవరం. 6. పాదచారులు రహదారులు దాటేందుకు దారి చూపే మోడల్, శ్రీపాద నారాయణసాయి, శశి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, రాజమహేంద్రవరం. 7. స్మార్ట్ కీమో కూలింగ్ ఫ్రిజ్, పరదా వేదం వర్షిణి, లిటిల్ పారడైజ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, రాజమహేంద్రవరం. 8. కొబ్బరిని సులువుగా ఒలిచే చేతి పనిముట్టు, కొత్తల సత్య దుర్గా నాగేంద్ర కుమార్, జెడ్పీ హైస్కూల్, సీతానగరం. 9. ప్రమాదాల నివారణకు ఐ బ్లింక్ సెన్సార్, ఎస్.అనూష, సాంఘిక సంక్షేమ శాఖ జూనియర్ కళాశాల, గోపాలపురం.



ఇన్‌స్పైర్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జేసీ తేజ్‌భరత్



రాష్ట్ర స్థాయికి ఎంపికైన మల్టీపర్పస్ అగ్రికల్చరల్ టూల్

రైతులకు అన్ని సౌకర్యాలూ అందాలి


రైతే రాజు. అతడికి అన్ని సౌకర్యాలూ పూర్తిగా అందితేనే మనందరం హాయిగా ఉంటాం. అటువంటి వ్యవసాయ రంగంలో పరిశోధనలు మరింత పెరగాలి. ఆ ఆలోచన నుంచే మల్టీపర్పస్ అగ్రికల్చరల్ యంత్రం తయారు చేశాను. నా ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికవడం ఆనందంగా ఉంది.

– ఎ.విహారిక, విద్యార్థి

రోడ్డు ప్రమాదాలను అరికడతాం


రోజూ పేపర్లలో, టీవీల్లో రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారిని చూస్తున్నాను. రోడ్డు దాటే క్రమంలో చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పుడున్న ట్రాఫిక్ సిగ్నల్ సిస్టంతో పాటు నేను తయారు చేసిన ప్రాజెక్టు పాదచారులకు, రోడ్డు దాటుతున్న వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. నా ప్రాజెక్టు అంతర్జాతీయ స్థాయికి వెళుతుందని గట్టి ధీమాతో ఉన్నాను.

– శ్రీపాద నారాయణ, విద్యార్థి

మరిన్ని ప్రయోగాలు చేస్తా


కొబ్బరి తోటలకు పేరు కోనసీమ. ఆ ప్రాంతంలో నిత్యం వేలాది కొబ్బరి కాయలు ఒలుస్తూంటారు. దీనికి వారు ఎంతో కష్టపడుతూంటారు. పని చాలా ఆలస్యంగా జరుగుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అతి తేలికగా కొబ్బరి ఒలిచే యంత్రాన్ని మా ఉపాధ్యాయుల సహకారంతో తయారు చేశాను. ఇది కొబ్బరి రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇంకా మరిన్ని ప్రయోగాలు చేస్తా.

– కె.నాగేంద్రకుమార్, విద్యార్థి

శభాష్ వలంటీర్

- 37 మందికి సేవావజ్ర, 118 మందికి సేవారత్న, 8,879 మందికి సేవామిత్ర అవార్డులు
- 9,034 మందికి రూ.13,83,90,000 అందజేత
- పురస్కారాలు ప్రదానం చేసిన మంత్రి చెల్లుబోయిన వేణు



వలంటీర్లకు నమూనా చెక్ అందజేస్తున్న మంత్రి వేణు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వలంటీర్ల సేవలను గుర్తించి వారిని సత్కరించడం చాలా ఆనందంగా ఉందని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం కలెక్టరేట్‌లో గురువారం వేడుకగా జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి వేణు మాట్లాడుతూ, వలంటీర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికలని అన్నారు. ఇది ప్రపంచం మెచ్చుకున్న గొప్ప వ్యవస్థ అని చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించడాన్ని ఈ వ్యవస్థ ద్వారా సీఎం జగన్ సుసాధ్యం చేశారని అన్నారు. రానున్న వారం రోజులూ నియోజకవర్గం స్థాయిల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాలను ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తారని మంత్రి తెలిపారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ, అవినీతికి తావు లేకుండా కులం, మతం, వర్గం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా వివిధ సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధులుగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.తేజ్ భరత్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లను సన్మానించారు. వారికి నమూనా చెక్ అందజేశారు.

న్యూస్‌రీల్

పుష్కర వనంలో అడ్వెంచర్ బైక్ రైడింగ్


అడ్వెంచర్ బైక్ రైడింగ్‌ను ప్రారంభిస్తున్న డీఎఫ్‌ఓ నాగరాజు

రాజానగరం: పుష్కర వన సందర్శకులకు అడ్వెంచర్ బైక్ రైడింగ్ కొత్త అనుభూతినిస్తుందని జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) నాగరాజు అన్నారు. లాలాచెరువులోని మహా పుష్కర వనంలో అడ్వెంచర్ బైక్ రైడింగ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. యజ్ఞ రిట్రీట్ సంస్థ సహకారంతో అటవీ శాఖకు కుదిరిన ఒడంబడికలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. దీనికి వసూలు చేసే ఫీజులో 30 శాతం అటవీ శాఖకు చెల్లిస్తారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, చింతూరు డీఎఫ్‌ఓలు రవీంద్ర, జేపీ సౌజన్య, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ త్రిమూర్తులురెడ్డి, యజ్ఞ రిట్రీట్ సంస్థ ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, ఎఫ్‌ఆర్‌ఓ ధనరాజ్, డీఆర్‌ఓలు చల్లా శ్రీనివాసరావు, పద్మావతి పాల్గొన్నారు.

తూనికలు - కొలతల అధికారుల దాడులు
24 కేసుల నమోదు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా వివిధ షాపులపై తూనికలు – కొలతల అధికారులు గురువారం దాడులు చేసి, 24 కేసులు నమోదు చేశారు. ఆరు ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన అధికారులు.. రాజమహేంద్రవరం ఎస్‌వీజీ మార్కెట్, గోకవరం బస్టాండ్, జేఎన్ రోడ్డు, రామదాసుపేట, కొంతమూరు, గాడాల, రాజానగరం ప్రాంతాల్లో ఈ దాడులు నిర్వహించారు. వంట గ్యాస్, నిత్యావసరాలు విక్రయించే సూపర్ మార్కెట్లు, రైస్ స్టోర్‌లు, పండ్లు, కూరగాయల దుకాణాల్లో తనిఖీలు చేశారు. తక్కువ తూకం ఉన్న వంట గ్యాస్ సిలిండర్లు అమ్ముతున్నందుకు 5, తక్కువ తూకంతో బియ్యం బస్తాలు అమ్ముతున్నందుకు 1, తూకం సరిగా లేకుండా పండ్లు అమ్ముతున్నందుకు 1, తయారీ ధర లేకుండా అమ్ముతున్నందుకు 17 చొప్పున కేసులు నమోదు చేశారు. ఆ శాఖ ఏలూరు జాయింట్ కంట్రోలర్ పి.సుధాకర్, కాకినాడ, డిప్యూటీ కంట్రోలర్ ఎస్.జనార్దనరావు, అసిస్టెంట్ కంట్రోలర్లు శామ్యూల్‌రాజ్, రాజేష్, సలీం ఆధ్వర్యాన ఇన్‌స్పెక్టర్లు సరోజిని, ప్రసాద్, శివబాలాజీ, కుటుంబరావు, నాగేంద్రకుమార్, మోహన్ ఈ దాడుల్లో పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం


ఆర్టీసీ డ్రైవర్‌ను సత్కరిస్తున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం సిటీ: రోడ్డు భద్రత అనేది పెద్ద వాహనాల డ్రైవర్లతో పాటు పాదచారుల నుంచి ద్విచక్ర వాహనాలు నడిపే వారందరిపైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గ్యారేజీలో జిల్లా ప్రజా రవాణా అధికారి కె.షర్మిల అశోక అధ్యక్షత గురువారం జిల్లా వ్యాప్తంగా నాలుగు డిపోల నుంచి వచ్చిన అధికారులు, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు సంకేతాలు, నియమ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఇది మన అందరి సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. అనంతరం రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోలకు చెందిన ప్రమాద రహిత డ్రైవర్లు 15 మందిని ఎంపిక చేసి నగదు బహుమతితో పాటు శాలువ, ప్రశంసా పత్రాల అందజేసి సన్మానించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా డిపోల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన 24 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సంపత్ కుమార్, నాలుగు డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర లీగల్ సెల్ కమిటీలో ఇద్దరికి చోటు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరు న్యాయవాదులకు చోటు దక్కింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేసింది. లీగల్ సెల్ సెక్రటరీగా గూడూరు రాధిక, జాయింట్ సెక్రటరీగా బి.కృష్ణమోహన్ నియమితులయ్యారు.

డీఎస్పీల బాధ్యతల స్వీకరణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బి.ఆదినారాయణ, స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా దేగల ప్రభాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కలు అందజేశారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆదినారాయణ పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా పని చేస్తూ ఇటీవలి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ దిశ పోలీస్ స్టేషన్‌లో నియమితులయ్యారు. అలాగే, 1995 బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్ కర్నూలు రేంజ్ సీఐడీ (క్రైం ఎకనామిక్ వింగ్) డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఇక్కడ స్పెషల్ బ్రాంచ్‌కు వచ్చారు.





ఎస్పీ జగదీష్‌కు మొక్కలు అందిస్తున్న నూతన డీఎస్పీలు ఆదినారాయణ, ప్రభాకర్

కాతేరులో ఎస్‌పీఎఫ్ జోనల్ కార్యాలయం

రాజమహేంద్రవరం రూరల్/కంబాలచెరువు (రాజమహేంద్రవరం సిటీ): కాతేరులో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఏపీఎస్‌పీఎఫ్) జోనల్ కార్యాలయంతో పాటు, శిక్షణ కేంద్రం నిర్మాణం చేపడుతున్నామని డైరెక్టర్ జనరల్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. ఏపీఎస్‌పీఎఫ్ జోనల్ కార్యాలయాన్ని ఆయన, ఐజీ బీవీ రామిరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కాతేరు ప్రత్యేక రక్షణ దళానికి ఇటీవల కేటాయించిన ప్రభుత్వ భూమిని త్రివిక్రమ్‌వర్మ పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై ఎస్‌పీఎఫ్ భద్రత కల్పిస్తున్న ఓఎన్‌జీసీ, విమానాశ్రయం, బ్యాంకు గార్డుల పని తీరు అడిగి తెలుసుకున్నారు. ఆయా సంస్థలకు నిరంతరం పటిష్ట భద్రతను కల్పించాలని అధికారులను త్రివిక్రమ్‌వర్మ అధికారులను ఆదేశించారు. ఎస్‌పీఎఫ్ సిబ్బంది పని తీరును క్షుణ్ణంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం జోనల్ కమాండెంట్ కేఎన్ రావు, అసిస్టెంట్ కమాండెంట్లు పీవీఎస్‌పీడీ ప్రసాదరావు, ఒ.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



కాతేరులో ఏపీఎస్‌పీఎఫ్‌కు కేటాయించిన భూమిలో అధికారులతో మాట్లాడుతున్న త్రివిక్రమ్‌వర్మ

సత్యదేవునికి కొత్త తేరు

- నేడు ప్రారంభం
- ఉదయం కొత్త రథంపై ఊరేగనున్న సత్యదేవుడు, అమ్మవారు
- రూ.34 లక్షలతో తయారీ
- మరో మూడు నెలల్లో సిద్ధం కానున్న పెద్ద రథం
- రూ.1.08 కోట్లతో చురుకుగా నిర్మాణం

అన్నవరం: ఏడు గుర్రాల రథంపై ఆకాశంలో విహరించనున్న సూర్యదేవుని పర్వదినం రథసప్తమి నేడు. సరిగ్గా ఇదే రోజున రత్నగిరి వాసుడు సత్యదేవుడు.. దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవితో కలసి రత్నగిరి ప్రాకారంలో నూతనంగా ముస్తాబయిన రథంపై విహరించనున్నాడు. టేకు కలపతో రూ.34 లక్షల వ్యయంతో అత్యంత సుందరంగా నిర్మించిన ఈ కొత్త రథాన్ని శుక్రవారం ప్రారంభించనున్నామని అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ తెలిపారు. కొండ దిగువన పంపా సత్రంలో ఉన్న ఈ రథం శిఖరంపై కలశ స్థాపన ఉదయం 5 గంటల నుంచి జరగనుంది. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 8 గంటలకు ఈ రథాన్ని రత్నగిరికి తరలిస్తారు. అక్కడ తూర్పు రాజగోపురం ఎదురుగా దీనిని ఉంచి పూజలు చేస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని రథంపై వేంచేయించి, ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయిస్తారు. ఈ సందర్భంగా ఎనిమిది దిక్కుల్లో కుంభం పోసి, దాని మీదుగా రథాన్ని లాగుతారని పండితులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని అధికారులు కోరారు.



నేడు ప్రారంభించనున్న చిన్న రథం

నెరవేరిన భక్తుల కోరిక

సత్యదేవుని, అమ్మవారిని ఊరేగించేందుకు సుమారు 40 ఏళ్ల క్రితం తయారు చేసిన వెండి రథం ఉంది. దీనినే రత్నగిరిపై స్వామివారి ఉత్సవాలు, వార్షిక కల్యాణ మహోత్సవాలు, కొండ దిగువన జరిగే ఊరేగింపుల్లో ఇప్పటి వరకూ ఉపయోగిస్తున్నారు. ఇది శిథిలావస్థకు చేరడంతో టేకుతో రెండు రథాలు రూపొందించాలని భక్తులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఆగస్టులో రూ.1.42 కోట్ల వ్యయంతో నాణ్యమైన బస్తరు టేకుతో రెండు రథాల నిర్మాణానికి అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ టెండర్లు పిలిచి ఖరారు చేశారు. ఈ రథాల తయారీ టెండర్లను కోనసీమ జిల్లా మురమళ్లకు చెందిన శ్రీ మాణిక్యాంబ శిల్పకళ వుడ్ వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, కొల్లాటి శ్రీనివాస్ దక్కించుకున్నారు. రూ.34 లక్షలతో చిన్న రథం, రూ.1.08 కోట్లతో పెద్ద రథం తయారు చేయించేందుకు ప్రణాళిక రూపొందించారు. రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను ఊరేగించేందుకు చిన్న రథం, సత్యదేవుని కల్యాణ మహోత్సవాల్లో కొండ దిగువన ఊరేగించేందుకు పెద్ద రథం ఉపయోగించాలని నిర్ణయించారు. ముందుగా చిన్న రథం నిర్మాణం పూర్తి చేశారు. దీనిని 14 అడుగుల ఎత్తు, 7.5 అడుగుల పొడవు, 6.3 అడుగుల వెడల్పున తయారు చేయించారు. నాలుగు స్తంభాలపై శిఖరం వస్తుంది. నాలుగు చక్రాలపై అందమైన లతలు చెక్కారు. రథంపై దేవతామూర్తులు, పలు ఆకర్షణీయమైన డిజైన్లు చిత్రీకరించనున్నారు. ముందు భాగంలో రెండు గుర్రాలను అమర్చారు. దీనికి వెండి రేకు తాపడం చేయాలని భావించినా దాతలు ముందుకు రాకపోవడంతో టేకు రథాన్ని రథసప్తమి పర్వదినాన ప్రారంభిస్తున్నారు. దాతలు ముందుకు వస్తే వెండి రేకు తాపడం చేస్తారని అధికారులు తెలిపారు. పెద్ద రథం పని కూడా చురుకుగా జరుగుతోంది. 20 మందికి పైగా శిల్పులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. దీనిని 33.9 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పు, 23.5 అడుగుల పొడవున మూడంతస్తుల్లో రూపొందిస్తున్నామని కాంట్రాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. ఈ రథాలు వంద సంవత్సరాల వరకూ చెక్కు చెదరవని అన్నారు. చిన్న రథం నడిపి చూశామని, బాగా పని చేస్తోందని తెలిపారు.



పీఠం దశ పూర్తయిన పెద్ద రథం



పెద్ద రథం రెండో అంతస్తు నిర్మాణం

క్లుప్తంగా

'ఈట్ రైట్ రైల్వేస్టేషన్'గా అన్నవరం ఎంపిక

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్‌ను ప్రతిష్టాత్మకమైన 'ఈట్ రైట్ స్టేషన్'గా కేంద్ర ప్రభుత్వ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మినిస్ట్రీకి చెందిన 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ సంస్థ సర్టిఫికెట్‌ను ప్రదానం చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే పీఆర్వో నుస్రాత్ ఎం.మండ్రూప్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని విజయవాడ రైల్వే డివిజన్‌లో ఈ విధంగా సర్టిఫికెట్ పొందిన ఏకైక రైల్వే స్టేషన్ అన్నవరం కాగా, దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో హైదరాబాద్‌లోని నాంపల్లి , అన్నవరం ఎంపికయ్యాయని తెలిపారు. అన్నవరం టెంపుల్ టౌన్ రైల్వే స్టేషన్ ద్వారా ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని వీరికి స్టేషన్‌లో హైజనిక్, హై క్వాలిటీ ఆహార పదార్థాలు సరఫరా చేయడం, ఫుడ్ స్టాల్స్ నిర్వాహకులు ప్రయాణికులకు మర్యాదపూర్వకంగా సేవలు అందించడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని ఈ ఎంపిక చేసినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్ షాపుల్లో పరిశుభ్రత, రైల్వేస్టేషన్ పరిసరాలలో కూడా ఎటువంటి అపరిశుభ్రత చోటు చేసుకోకపోవడం వంటి అంశాలలో కూడా 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' నిర్వహించిన సర్వేలు, ఆడిట్‌లలో అన్నవరం రైల్వేస్టేషన్ ఉత్తమమైనదిగా నిలిచినట్లు తెలిపారు. విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ సీనియర్ డీసీఎం వావిలాపల్లి రాంబాబు, డీవిజనల్ ఆఫీసర్ (సేఫ్టీ) పి.చంద్రశేఖర్, క్యాటరింగ్ అండ్ కమర్షియల్ టీఎం ఎఫ్ఎస్ఓ రహమతుల్లా, సిబ్బందిని అభినందించారు.

నేడు మెగా జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. జాబ్‌మేళా వాల్‌పోస్టర్ గురువారం ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జిల్లా ఉపాధి కల్పన అధికారులు జి.శ్రీనివాసరావు, వసంతలక్ష్మి, ఐటీఐ ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ ఆవిష్కరించారు. వివిధ రంగాలకు చెందిన 14 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి 1,810 మంది ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ ఉత్తీర్ణులైనవారు హాజరుకావచ్చన్నారు. ఉదయం 9గంటలలోపు విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

అభివృద్ధి పథంలో అంతర్వేది

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధుల వెల్లువ
- గతంలో ఎన్నడూ లేని విధంగా క్షేత్రంలో పలు పనులు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి పుణ్యక్షేత్రంలో భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోవడంతో పాటు, పరిసరాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయి.

రూ.కోటికి పైబడి నిధులతో కొత్త రథం

అంతర్వేది ఆలయ ప్రాంగణంలో 2020లో జరిగిన రథం దగ్ధం దుర్ఘటనపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తక్షణం స్పందించారు. దెబ్బతిన్న పాత రథం స్థానే కొత్త రథం నిర్మాణానికి రూ.కోటికి పైబడి నిధులు తక్షణం మంజూరు చేశారు. సీఎం జగన్ ఆదేశాలతో మంత్రులు అధికారులు సంయుక్తంగా కృషి చేశారు. 41 అడుగుల ఎత్తుతో ఏడంతస్తుల లక్ష్మీనృసింహస్వామివారి ఆరు చక్రాలతో కూడిన రథం నిర్మాణం 90 రోజుల్లో పూర్తి అయింది. భక్తుల మనోభావాలను రక్షించే విధంగా, ధర్మరక్షణ కోసం కొత్త రథం నిర్మాణానికి సీఎం తక్షణ చర్యలు తీసుకోవడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. 2021 ఫిబ్రవరి 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రథాన్ని ప్రారంభించారు. గతంలో లేని విధంగా సాంకేతిక పరిజ్ఞానంతో రథానికి హైడ్రాలిక్ బ్రేక్ సిస్టం, సెంట్రల్ ఆఫ్ గ్రావెటీ ఆధారంగా పని చేసే జాకీ సిస్టం ఏర్పాటు చేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.13.5 కోట్లు

ఆలయం అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రూ.13.5 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.8.5 కోట్లు ఆలయ పునర్నిర్మాణం, కోనేరు నిర్మాణం, మిగిలిన రూ.5 కోట్లు ఆలయానికి తూర్పువైపున ఉన్న 34 ఎకరాల దేవస్థానం భూమిలో 20 ఎకరాలు ఎర్త్ ఫిల్లింగ్, అవసరమయ్యే మౌలిక వసతులు సమకూర్చుకోవడానికి కేటాయించారు.

రూ.17.33 కోట్లతో తాగునీటి ప్రాజెక్ట్

ఏడాది పొడవునా సముద్ర తీరంలో గుక్కెడు తాగునీటికి నానా కష్టాలు పడుతున్న ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంలో అంతర్వేది దేవస్థానంలో చెరువు జల్ జీవన్ మిషన్ పథకంలో సమగ్ర రక్షిత తాగునీటి పథకంగా రూపు దిద్దుకుంటోంది. ఇక్కడ మంచినీటి సమస్యను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో సీఎం జగన్ తక్షణం స్పందించి దేవస్థానంలో ఉన్న చెరువును జేజేఎంలో సమగ్ర రక్షిత తాగునీటి ప్రాజెక్ట్‌గా తీర్చిదిద్దేందుకు రూ.17.33 కోట్లు మంజూరు చేశారు. దీంతో ప్రాజెక్ట్ పనులను అధికారులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం, గొంది గ్రామాల్లోని 13 ఆవాసాల్లో 21,600 మంది జనాభాకు రక్షిత తాగునీరు అందించేందుకు ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది.

రూ.25 కోట్లతో ప్రధాన రహదారి అభివృద్ధి

అంతర్వేది పుణ్యక్షేత్రానికి పోయే భక్తులతో పాటు, పలు ప్రాంతాల ప్రజల రాకపోకలకు అనువుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆర్ అండ్ బీ శాఖ అంతర్వేది రోడ్డు విస్తరణ పనులు దాదాపుగా పూర్తి చేసింది. అంతర్వేది చానల్‌ను ఆనుకుని టేకిశెట్టిపాలెం సెంటర్ వద్ద నుంచి అంతర్వేది దేవస్థానం వరకూ ఉన్న ఈ రోడ్డు విస్తరణ పనులు రెండు దఫాలుగా చేపట్టేందుకు అధికారుల కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా శంగవరప్పాడు సరిహద్దు నుంచి దేవస్థానం వరకూ 10 కిలోమీటర్లు మేర మొదటి విడతలో రోడ్డు విస్తరణ పనులు దాదాపుగా పూర్తి చేశారు.



క్షేత్రంలో ప్రధాన, ఉపాలయాలు



అభివృద్ధి చేస్తున్న అంతర్వేది చెరువు

రూ.18 లక్షలతో నిర్మాణం పనులు

అంతర్వేదిలో రూ.18 లక్షలతో వసంత మంటపం నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో పౌర్ణమి రోజున సముద్ర స్నానం అనంతరం స్వామి సేద తీరే వసంత మంటపం పూర్తిగా శిథిలమైంది. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మంటపం పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

సీఎం జగన్ ఇచ్చిన నిధులతో అభివృద్ధి



అంతర్వేది క్షేత్రం, పరిసరాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న నిధులతోనే అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో క్షేత్రంతో పాటు, పరిసరాల అభివృద్ధికి ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. అంతర్వేదిలో నిర్మితమవుతున్న తాగునీటి ప్రాజెక్ట్ తీరానికే మణిహారం.

– రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే, రాజోలు

భక్తుల రద్దీ పెరుగుతోంది



అంతర్వేది పుణ్యక్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేవస్థానం ఆదాయం పెరిగేందుకు దోహదపడుతున్నాయి. ఏటా భక్తుల రద్దీ పెరుగుతోంది. తదనుగుణంగా సౌకర్యాలు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తోంది.

– వి.సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్, అంతర్వేది దేవస్థానం

కల్యాణోత్సవాల షెడ్యూల్



అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి

అంతర్వేది పుణ్యక్షేత్రంలో గురువారం నుంచి 25 వరకూ నిర్వహించే లక్ష్మీనృసింహుని వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల షెడ్యూల్ ఇలా ఉంది.16న రథసప్తమి, సూర్యవాహనం, చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవాలు, స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుని, పెండ్లికుమార్తెను చేయడం(ముద్రికాలంకరణ). 17న గరుడపుష్పక, పుష్ప వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు. 18న హంస, శేషవాహనాలపై గ్రామోత్సవాలు, ధ్వజారోహణ. 19న పంచముఖ ఆంజనేయస్వామి, కంచుగరుడ వాహనాలపై గ్రామోత్సవాలు, రాత్రి గం.12–29 ని.లకు ఆరుద్రా నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశంనందు స్వామివారి కల్యాణ మహోత్సవం. 20న భీష్మ ఏకాదశి పర్వదినాన రథోత్సవం. 21న గజ, పొన్న వాహనాలపై గ్రామోత్సవాలు, రాత్రి అన్నపర్వత మహానివేదన. 22న హనుమద్వాహనం, సింహవాహనంపై గ్రామోత్సవాలు, సదస్యం. 23న రాజాధిరాజ, అశ్వవాహనంపై గ్రామోత్సవాలు, 16 స్తంభముల మండపం వద్ద చోరసంవాదం ఘట్టం. 24న పౌర్ణమి రోజున చక్రవారి సముద్రస్నాం(పౌర్ణమి స్నానాలు), గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం, అవభృథోత్సవం, రాత్రి ధ్వజ అవరోహణ. 25న పుష్పక వాహనంపై గ్రామోత్సవం. సాయంత్రం అంతర్వేది చెరువులో హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం. రాత్రి ఉత్సవరులకు తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, ద్వాదశతిరువారాధన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీ పుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్టి, స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాల ముగింపు.

మోటారు సైకిళ్ల దొంగల అరెస్టు

17 వాహనాల స్వాధీనం

రామచంద్రపురం: కొంత కాలంగా రామచంద్రపురం, మండపేట, యానాం, సామర్లకోట పరిసర ప్రాంతాల్లో మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ వెల్లడించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ పి.దొరరాజు, ఎస్సై కె. సురేష్‌బాబులతో కలిసి వివరాలను వెల్లడించారు. పట్టణంలో గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో తమకు వచ్చిన సమాచారం మేరకు ద్రాక్షారామ రోడ్డులోని గ్యాస్ గొడౌన్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఈ నలుగురు పట్టుబడినట్లు తెలిపారు. రామచంద్రపురం పట్టణం సాయినగర్‌కు చెందిన సలాది ఉదయ్ సాయిసుధీర్, పెమ్మిరెడ్డి బాలవెంకట్ అలియాస్ బాల, కుమ్మర్ల వీధికి చెందిన అమలదాసు నాగబాబు, మండపేట మండలం చినద్వారపూడికి చెందిన కొప్పిశెట్టి దిలీప్‌లను అరెస్టు చేసి విచారించామన్నారు. వారి వద్ద నుంచి రూ.11.45 లక్షల విలువ చేసే 17 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నెల 8వ తేదీన పట్టణంలోని చర్చి కాంపౌండ్ వద్ద ఒక మోటారు సైకిల్ దొంగతనం జరగ్గా ఫిర్యాదు దారుడు ఇచ్చిన సమాచారం మేరకు రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో దొంగతనాలపై నిఘా ఏర్పాటు చేసి, సీఐ దొరరాజు, ఎస్సై కె.సురేష్ బాబు, హెడ్‌కానిస్టేబుళ్లు కె.వీరబాబు, ఎస్.ఈశ్వరరావు, కానిస్టేబుళ్లు టి.సూరిబాబు, కె.అనిల్‌కుమార్, పోలయ్య, కె లోవరాజుతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. నలుగురు నిందితులు చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. రామచంద్రపురంలో 5, ద్రాక్షారామ 1, పామర్రు 2, రాయవరం 1, అంగర 2, మండపేట టౌన్ 2, సామర్లకోట 1, యానాంలో 3 మోటారు సైకిళ్ల దొంగతనాల కేసులు నమోదు అయ్యాయన్నారు. ఈ కేసుల పరిష్కారంలో చాకచక్యంగా వ్యవహరించిన బృందాన్ని ఎస్పీ ఎస్.శ్రీధర్ అభినందించనట్లు ఆయన తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లతో డీఎస్పీ రామకృష్ణ, సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు

అనుమానంతో భార్య పీక కోసి హత్య

- ఆపై భర్త ఆత్మహత్య
- కడియపుసావరంలో కలకలం

కడియం: మండలంలోని కడియపుసావరంలో అనుమానంతో ఒక వ్యక్తి తన భార్యను పీక కోసి హత్య చేశాడు. అనంతరం పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కడియం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపుసావరం ఆంజనేయస్వామి గుడి సమీపానికి చెందిన సత్యశ్రీ (31)కి అదే గ్రామం వడ్డి వీరభద్రరావు కాలనీకి చెందిన దూళ్ళ సూరిబాబు(38)తో పదహారేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడు, అయిదో తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. అయితే సూరిబాబుకు తన భార్య వేరొకరితో ఫోన్‌లో మాట్లాడుతోందన్న అనుమానం ఉండేది. దీంతో వీరిద్దరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సత్యశ్రీ తన పుట్టింటి వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి సూరిబాబు పెద్దలతో కలిసి ఆమె వద్దకు వెళ్లాడు. తనతో కాపురానికి రావాలని అడిగాడు. అప్పుడే పిల్లలను తనతో పాటు తీసుకు వెళ్లిపోయాడు. అయితే సత్యశ్రీ ఉదయం రానని చెప్పింది. దీంతో ఆగ్రహానికి గురైన సూరిబాబు గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గ్రాఫ్టింగ్ బ్లేడ్‌తో ఆమె పీక కోసి, గునపంతో కొట్టి చంపేశాడు. చుట్టుపక్కలవారు, బంధువులు ఉదయం సూరిబాబు అక్కడి నుంచి హడావుడిగా వెళ్లడాన్ని చూశారు. దీంతో సత్యశ్రీ ఉండే గదిలోకి వెళ్లి చూడగా రక్తపు మడుగులో ఉన్న ఆమె అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఆమె తోబుట్టువులకు, పోలీసులకు సమాచారం తెలియజేశారు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ ఘటనా స్థలానికి చేరుకుని, మృతురాలు సోదరి అడ్డూరి సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా భార్యను హత్య చేసిన సూరిబాబు మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని పొలాల్లో పురుగు మందు సేవించి అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారొచ్చి అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఘటనా స్థలాన్ని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ పరిశీలించారు. ఇదిలా ఉండగా భార్యాభర్తలిద్దరూ మృతి చెందడంతో పిల్లలిద్దరూ అనాథలుగా మారారు. క్షణికావేశంలో సూరిబాబు చేసిన పనికి పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని బంధువులు, గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.



సత్యశ్రీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ తులసీధర్



పిల్లలతో సూరిబాబు, సత్యశ్రీ (పాత చిత్రం)



సూరిబాబు మృతదేహం

నేడు సూర్యదేవుని జయంతి

- జి.మామిడాడలో ఏర్పాట్లు పూర్తి
- నేడు రథోత్సవం

పెదపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామంలో శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి వారి జయంతి, రథసప్తమి శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళశాసనాలతో ఆలయంలో శుక్రవారం రథ సప్తమితో ప్రారంభమయ్యే కల్యాణ ఉత్సవాలు 25వ తేదీ వరకు జరుగుతాయి. 20న స్వామివారి కల్యాణం ఘనంగా జరుగుతుంది. సూర్య భగవానుడి పుట్టిన రోజైన రథసప్తమి పర్వదినం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి వెంకటనరసింహ ఆచార్యులు ఆధ్వర్యంలో 10 మంది పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటారు. స్వామివారి దర్శనం కోసం భక్తులకు ప్రత్యేక క్యూ లు ఏర్పాటు చేశారు. సూర్యభగవానుని దేవేరులైన ఉష,పద్మిని,ఛాయ,సౌంజ్ఞ ఉత్సవ మూర్తులతో కలిసి సూర్య భగవానుడని పల్లకీలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఆలయం బయట ఉంచిన రథంలో ఉత్సవ మూర్తులను పెడతారు. అనంతరం అర్చకుల మంత్రోచ్ఛారణలతో అష్ట దిక్పాలిక బలిహరణం చేసి, వసంతంతో కూడిన గుమ్మడిని ప్రదానం చేస్తారు. రథోత్సవం మధ్యాహ్నం ప్రారంభిస్తారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు రథాన్ని సూర్యనారాయణ నామస్మరణతో ఉత్సాహంగా ముందుకు లాగుతారు. తదనంతరం రథోత్సవం ఆలయానికి రాత్రికి చేరుకుంటుంది. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు, అమృతకుండి ప్రసాద వినియోగాలు నిర్వహిస్తారు. ఉత్సవ కమిటీ, ఈఓ ఎం.మురళీ వీరభద్రరావు, వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసబాలకృష్ణారెడ్డి ఏర్పాట్లను చేస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో కొలువై ఉన్న ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యభగవానుడు

25 నుంచి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్: ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ – బెంచ్ ప్రెస్ (మెన్ అండ్ వుమెన్)–2024 పోటీలు ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడుయనుముల కృష్ణ పద్మరాజు, సెక్రెటరీ వంటెద్దు వెంకన్ననాయుడు తెలిపారు. అదే రోజు కోనసీమ పవర్ లిఫ్టింగ్ టీం సెలెక్షన్స్ నిర్వహిస్తామన్నారు. అమలాపురంలోని మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. పోటీలు జరిగే పార్కును గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలను 12 విభాగాలుగా నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తామన్నారు. అత్యధిక బరువులెత్తిన క్రీడాకారులకు స్ట్రాంగ్ మెన్ – స్ట్రాంగ్ వుమెన్‌లకు విన్నర్, రన్నర్ ట్రోఫీలతో పాటు నగదు పురస్కారాలను అందిస్తారు.

ఆపద వస్తే ముందుకు దూకాలి

పోలీసులకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ సూచన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగినప్పుడు వాటిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు నిత్యం లాఠీ, వెపన్, మాబ్ డ్రిల్‌లు నిర్వహించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ.అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగ అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సాయుధ బలగాల కవాతును ఏలూర్ రేంజ్ ఐజీ వీక్షించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అన్ని విధాల సిద్ధంగా ఉండాలన్నారు. ఈవీఎం, ముద్దాయిలు, లాంగ్ ఎస్కార్ట్ విషయంలో పోలీసులు చాలా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమష్టి కృషి, సమన్వయంతో మద్యం, గంజాయి, నాటుసారా అక్రమ రవాణాను నియంత్రించాలన్నారు. ప్రజాశాంతికి భంగం కలగకుండా శాంతి భద్రతల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎన్నికల సమయంలో పాటించవలసిన నియమ నిబంధనలు, చట్టాలను ఆయన వివరించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగాలను ఐజీ పరిశీలించారు. డీసీఆర్‌బీ, డీటీఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్ కీలక విభాగాల అధికారులు సమర్పించిన వార్షిక పనితీరు నివేదికలను పరిశీలించారు. పోలీసు కార్యాలయంలో వున్న కమాండ్ కంట్రోల్ విభాగం పనితీరు, జిల్లాలో వివిధ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్ కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ జరుగుతున్న తీరును ఆయన ప్రత్యక్షంగా వీక్షించారు.



పోలీస్ పరేడ్‌లో పాల్గొన్న ఏలూర్ రేంజ్ ఐజీ అశోక్ కుమార్